క్లుప్తంగా

వైభవంగా మారెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



ములకలచెరువు: మండలంలోని కోనేటివారిపల్లెలో ఆదివారం గ్రామస్తులు శ్రీ మారెమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణపతి పూజ, గోవు పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

కారును ఢీ కొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు

ములకలచెరువు: కర్ణాటక ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీ కొనడంతో నలుగురికి స్వల్పగాయాలైన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అనంతపురంకు చెందిన వి.కొండా రెడ్డి తన స్నేహితులతో కలిసి తిరుపతికి బయల్దేరారు. ములకలచెరువు మండలం బురకాయలకోట సమీపంలోకి రాగానే బళ్లారికి వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినింది. కారులోని వి.కొండారెడ్డి(45), రామ్మోహన్(44), రామాంజులు(48), రామ్‌కుమార్(45)లకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ దేవతలకు పూజలు



కలకడ : గ్రామదేవతలు తిరుపతి గంగమ్మ, బోయకొండమ్మకు శనివారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ బీసీ కాలనీ గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతల కోసం నూతన ఆలయాలు నిర్మించి, విగ్రహ ప్రతిష్ట కోసం 41 రోజులు హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అందులో భాగంగా అలంకరించిన చాందినీ బండిపై గ్రామ పురవీధులలో అమ్మవారి ప్రతిమలను ఊరేగించారు. ఇంటింటా పూజలు అందుకున్న అమ్మవారిని ఆలయ ప్రవేశం చేయించి ప్రత్యేక పూజలు చేశారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

కలికిరి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కలికిరిలో పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్టభద్రులకు రెండు, ఉపాధ్యాయ ఓటర్లకు ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేశామని, 1555 మంది పట్టభద్రులు, 93 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి ఒకొక్క బూత్‌కు పీఓ, ఏపీఓ, ఓపీఓ లు ముగ్గురు మొత్తం ఐదురుగు సిబ్బంది ఉంటారన్నారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్‌గా సురేష్‌నాయక్



కలకడ : వైఎస్సార్ సీపీ ఎస్టీసెల్ రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్‌గా కలకడ మండలం తండా పంచాయతీకి చెందిన డాక్టర్ సురేష్‌నాయక్‌ను రాష్ట్ర పార్టీ అధిష్టానం ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం నియామకపత్రం అందుకున్న డాక్టర్ సురేష్‌నాయక్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను తెలియజేసి ఎస్టీలు అందరూ వైఎస్సార్‌సీపీ వైపు ఉండే విధంగా కృషి చేస్తానన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు



ద్రవజీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చునని సీఆర్‌పీ రెడ్డి, పీఆర్‌పీ పెద్ద రెడ్డెయ్య అన్నారు. ఆదివారం మండలంలోని టి.సాకిరేవుపల్లిలో రైతు వినోద్ రెండు ఎకరాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. టమాటా, బీన్స్, పెసర, మిరప, వంగ, అరటి, ఉల్లి, కొబ్బరి, ఆముదం, బంతి పంటలను పరిశీలించి, వరి పంటకు 200 లీటర్ల ద్రవ జీవామృతం నీటిలో పారించారు. వరి పంటకు ఏ గ్రేడ్ మోడల్‌లోని పంటలకు 400 లీటర్ల ద్రవజీవామృతం తయారు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- మదనపల్లె డివిజన్‌లో 44 పోలింగ్ కేంద్రాలు, 25,770 మంది ఓటర్లు
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలవరకు పోలింగ్
- ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ ఎస్పీ, ఆర్డీఓ
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది



ఎన్నికల నిర్వహణపై సూచనలు ఇస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



పోలింగ్ విధులపై అవగాహన కల్పిస్తున్న టూటౌన్ సీఐ మురళీకృష్ణ

మదనపల్లె : రాష్ట్రంలో జిల్లాల విభజన జరిగిన తర్వాత తొలిసారిగా అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నియోజకవర్గాల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి అధికారులు సర్వం సిద్ధం చేశారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలకు సంబంధించి పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. ఆర్డీఓ ఎం.ఎస్.మురళి పోలింగ్ అధికారులు, సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లతో సమావేశం నిర్వహించి ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో మొత్తం 44 పోలింగ్ కేంద్రాల్లో గ్రాడ్యుయేట్స్ 23,838 మంది, టీచర్స్ 1,932 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ తదితర ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్, ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారితో పాటు ఇద్దరు ఓపీఓలను నియమించామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి రెండు బ్యాలెట్ బాక్సులను కేటాయించి, పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రంతో పాటు స్ట్రాంగ్‌రూం ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సిబ్బంది, సామగ్రి రవాణా కోసం ఎనిమిది రూట్లను గుర్తించి ప్రతి రూటుకు ఒక ఆర్టీసీ బస్సును, సెక్టోరియల్, రూట్ ఆఫీసర్‌ను కేటాయించామన్నారు. పోలింగ్ రోజు సీక్రసీ ఆఫ్ ఓటింగ్‌ను కచ్చితంగా పాటించాలని, ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో కేవలం ఒక్కరికి మాత్రమే అనుమతి ఉంటుందని, అందులో ఫోటో, వీడియోగ్రఫీలు నిషేధమన్నారు. మైక్రో అబ్జర్వర్‌లు పోలింగ్ ప్రక్రియను సూక్ష్మపరిశీలన చేయాలని, ఓటర్లను గుర్తించేందుకు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ అందుబాటులో ఉండాలన్నారు. ఎన్నికల సంఘం అందించిన వయొలెట్ కలర్ పెన్నును మాత్రమే ఓటింగ్‌లో ఉపయోగించాలన్నారు. ఓటరు ఒకటి, రెండు, మూడు, నాలుగు ప్రాధాన్యాలను సూచించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు పీఓ, ఏపీఓ, ఓపీఓ, మైక్రోఅబ్జర్వర్, వెబ్‌క్యామ్ స్టూడెంట్స్, వీడియోగ్రాఫర్స్, సెక్టోరియల్, రూట్ ఆఫీసర్స్ కలిపి మొత్తం 442 మందిని ఎన్నికల విధులకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో పోలింగ్ విధులు కేటాయించిన సిబ్బంది తమకు కేటాయించిన సామగ్రిని తీసుకుని జెడ్పీ హైస్కూల్ నుంచి బయలుదేరారు. ఎన్నికల సామగ్రి పంపిణీని జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, డీఎల్‌డీఓ లక్ష్మీపతి పరిశీలించారు.

పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ తెలిపారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లోని 44 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పట్టణంలోని బీటీ కళాశాల, జెడ్పీహైస్కూల్‌లోని 9 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఎన్నికల విధులకు 3 సీఐలు, 10 ఎస్‌ఐలు, 30 ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ 74, పోలీస్‌కానిస్టేబుల్ 31, మొబైల్‌పార్టీ 1, చెక్‌పోస్టులు 3, ఆర్మ్‌డ్‌ఫోర్స్ 2 నియమించామన్నారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, పెన్నులు, ఇతరవస్తువులు అనుమతించమన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. టూటౌన్ సీఐ మురళీకృష్ణ పోలింగ్ విధులపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

పీలేరు రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ రవి, సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం, తాగునీరు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. మండలంలో పట్టభద్రుల ఓట్లు 3,148, ఉపాధ్యాయ ఓట్లు 469 ఉన్నట్లు చెప్పారు. పట్టభద్రుల ఓటర్ల కోసం నాలుగు పోలింగ్ బూత్‌లు, ఉపాధ్యాయులకు ఒక బూత్ కేటాయించినట్లు చెప్పారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 30 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటింగ్‌కు సర్వం సిద్ధం

కలకడ : ఎమ్మెల్సీ ఓటింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ రాము, ఎంపీడీఓ నారాయణ, ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలో ఉపాధ్యాయుల ఓట్లు మొత్తం 40 ఉండగా, జాబితాలో ఇద్దరిని తొలగించినట్లు తెలిపారు. పట్టభద్రులు ఓట్లు 1188 ఉన్నట్లు తెలిపారు. అందరూ సహకరించి ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చేయాలని కోరారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు

తంబళ్లపల్లె: మండలంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ కళావతి, ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఎమ్మార్సీ కార్యాలయంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టభద్రులు 809 మంది, ఉపాధ్యాయులు 13 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నట్లు తెలిపరాఉ. ఎస్‌ఐ రామక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌బందోబస్తు చేసినట్లు తెలిపారు.

15 మండలాల్లో నేడు ఓటింగ్

బి.కొత్తకోట: తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. సోమవారం జరిగే ఎన్నికలకు తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని 15 మండలాలకు చెందిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఓటర్లు 23,838 మంది ఉండగా ఇందులో పురుష ఓటర్లు 15,490, మహిళ ఓటర్లు 8,345 మంది, ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు ఉన్నారు. ఈ ఓటర్లకు 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 1,932 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 1,180 మంది, మహిళలు 752 మంది ఉన్నారు. ఈ ఎన్నిక కోసం 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది



ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహశీల్దార్ రవి

వైభవంగా కనుమ గంగమ్మ తిరునాల

మదనపల్లె : బసినికొండ పంచాయతీ పుంగనూరు రోడ్డులో వెలసిన శ్రీ కనుమలో గంగమ్మ దేవతను ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే నవాజ్‌బాషా దర్శించుకున్నారు. కనుమలో గంగమ్మ తిరునాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వెంకటరమణ, గణేష్‌బాబు, కనకరాజు స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గ వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి రైతులు, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, రామాచార్లపల్లె సర్పంచ్ లక్ష్మీదేవి, సింగిల్‌విండో చైర్మన్ దండుకృష్ణారెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వైఎస్.మునిరత్నం, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, కౌన్సిలర్ భాను, రహీం, జి.శ్రీనివాసులు, ఎస్ఎస్‌టీ.శ్రీనివాసులు, కే.మంజునాథ్, మురళీ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



సంతానం కోసం వరపడిన భక్తులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం పెద్ద ఎత్తున భక్తుల రద్దీ నెలకొంది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సంతానం కోసం మహిళలు ఆలయపరిసరాల్లోని కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి పూజలు చేశారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

దండు మారెమ్మా..చలగ చూడమ్మా

కురబలకోట: మండలంలోని ముదివేడు దండు మారెమ్మ తిరుణాల సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు బైసాని జ్యోతి, మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి సారెను సమర్పించారు.

లోకేష్.. సభ్యత, సంస్కారం నేర్చుకో

ఎంపీపీ రెడ్డెమ్మ

మదనపల్లె : టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి నారాలోకేష్ రాజకీయాల కంటే ముందుగా సభ్యత, సంస్కారాలు, విలువలు నేర్చుకుని పాదయాత్ర చేస్తే బాగుంటుందని ఎంపీపీ రెడ్డెమ్మ అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని పాపాల నాయకులుగా వర్ణిస్తూ లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సుదీర్ఘ రాజకీయ అనుభవం, తండ్రి వయస్సు ఉన్నటువంటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రెండుసార్లు అత్యధిక మెజారిటీతో ఎంపీగా గెలిచిన మిథున్‌రెడ్డిని కనీసం ప్రజలతో నేరుగా ఎన్నిక కానటువంటి లోకేష్ విమర్శించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమే అయినా సభ్యత, సంస్కారాలు, స్థాయి మరచి మాట్లాడటం నాయకత్వ లక్షణం కాదన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ప్రజలందరికీ సమన్యాయం జరుగుతోందన్నారు. ఎస్సీ వర్గానికి చెందిన తాను ఎంపీపీగా అయ్యానంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతోనే సాధ్యపడిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

వాల్మీకిపురం: మండలంలోని గండబోయనపల్లిలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట, కలశ స్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రాతఃకాలారాధన, మూలమంత్ర జపాదులు, మహాస్నపనము, క్షీరాధివాసం, శిఖర, దీపస్తంభ ప్రతిష్ట, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, అర్చన, నైవేద్యం, మంగళహారతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అలాగే సాయంత్రం మూలవిగ్రహంకు గంధ, కుశ, పుష్ప, శయ్యాధివాసములు, ఉపచారములు, వాస్తు, నవగ్రహ, దీక్షాలక, అధివాస హోమములు, అర్చన, నైవేద్యము, వేదస్వస్తి, మంగళహారతి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, ఎంపీపీ అరుణమ్మ, సర్పంచ్ గుర్రప్ప, నాయకులు శీనా, రాజన్న, సత్తిపండు, క్రిష్టాంజనేయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



కలశస్థాపన కార్యక్రమంలో ఎంపీపీ అరుణమ్మ

పేదల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- మహానేత వైఎస్సార్ ఆశయసాధన దిశగా అడుగులు
- అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా ఆదర్శపాలన
- నిరంతరం ప్రజల్లో ఉన్న నాయకుడు సీఎం జగన్
- వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యే నవాజ్‌బాషా



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, నాయకులు, కార్యకర్తలు

మదనపల్లె : మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధన దిశగా, రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి, సామాజిక అభ్యుదయం లక్ష్యాలుగా పేదల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ అని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓ రాజకీయ పార్టీ ఎలా ఉండాలనేదానికి రోల్‌మాడల్‌గా వైఎస్సార్ సీపీ నిలిచిందన్నారు. గాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యం, అంబేడ్కర్ సామాజిక న్యాయం రెండింటినీ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ అమలుచేసి నాయకుడంటే ఇలా ఉండాలని చూపించారన్నారు. అధికారాన్ని హోదాగా కాకుండా బాధ్యతగా భావించి రాష్ట్రాభివృద్ధికి సామాన్య కార్యకర్తగా పాటుపడుతూ, నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సంక్షేమం కోసమే ఆలోచించే ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి 99శాతం హామీలను అమలుచేసిన ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న నాలుగేళ్ల ప్రతి ఇంటికీ అందిన సంక్షేమం, జరిగిన అభివృద్ధిని వివరిస్తే వైఎస్సార్ సీపీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రమణారెడ్డి, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, గార్ల చంద్రమౌళి, పోతబోలునాగరాజ, కౌన్సిలర్లు డిష్‌రామకృష్టారెడ్డి, పాల్‌చంద్రశేఖర్, ఈశ్వర్‌నాయక్, సుగుణ, వసీం, రాజేష్, శారదారెడ్డి, చరణ్, రహీం, ఎల్‌ఐసీ.సుధాకర్, బావాజాన్, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లెలో కుషావతీ నది ఒడ్డున ఏకశిలగుట్టపై వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఆలయ అర్చకులు అభిషేకం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే పగలు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామివారిని శ్రీదేవి, భూదేవిలతో కలిపి వైభవంగా ఊరేగింపు చేశారు. స్వామివారికి పట్టు వస్త్రాలను జిల్లాలోని చిన్నమండ్యం మండలం పడమటికోనకు చెందిన బోడిచెర్ల రామమూర్తి కుటుంబ సభ్యులు అందజేశారు. కల్యాణోత్సవం అనంతరం స్వామివారిని రథంపై ఊరేగించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఎస్‌ఐ పి. వెంకటేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓ పి. రమణ, సర్పంచ్ పీరాన్‌బి, ఎంపీటీసీ సభ్యురాలు బోడిమాని గీత, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడిశ క్రిష్టారెడ్డి, రవిచంద్ర, రామిరెడ్డి, సుబ్బరామయ్య, నరసింహులు, వెంకట్రమణ, ఆలయ అర్చకులు వరదాచార్యులు, యాజ్ఞికులు రఘునాధాచార్యులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.



నరసింహ స్వామివారి కల్యాణోత్సవం

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

వాల్మీకిపురం: మండలంలోని విఠలంలో శ్రీ వెంకటేశ్వర స్వామి పాదాల గుడి వద్ద స్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి కళాన్యాస ప్రాణప్రతిష్ట హోమములు, కలశ ఉద్వాసన, మార్జన మహా మంగళ హారతి, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మీనలగ్న పుష్కరాంశములో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామివారి కళ్యాణం కనుల విందుగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



వేంకటేశ్వర స్వామివారి కల్యాణం

సంక్షేమ రథ సారథి వైఎస్ జగన్

- ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి

వాల్మీకిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి సంక్షేమ రథ సారథిగా నిలిచారని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను నిలబెట్టడానికి తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి జనరంజకమైన పాలన సాగిస్తున్నారని కొనియాడారు. పార్టీ ఆవిర్భవించి నేటికి 13ఏళ్లు అయ్యాయన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి విలువలు, విశ్వసనీయతకు పట్టం కడుతూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. నవరత్న పథకాలను అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలోనే అమలు చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల మనసులో చెరగని ముద్ర వేసిందన్నారు. అలాగే మండలంలోని చింతపర్తి, గండబోయనపల్లెల్లో మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మైనార్టీలను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, రాయుడు, నరసింహులు, అబ్దుల్ కలీమ్, సాధిక్, షాహెద్, ఇర్ఫాన్, మహబూబ్‌బాషా, రవి, రఘు, శ్రీధర్‌రాయల్, రవీంద్ర రెడ్డి, శివారెడ్డి, ఆనంద, సైపుల్లా పాల్గొన్నారు.



మైనార్టీలను సన్మానిస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి



కలికిరి : రోగులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

పీలేరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మహితాఆనంద్, ఏపీ వేర్ హౌస్ గోడౌన్ డైరెక్టర్ నాగరాజమ్మ, నాయకులు హుమయూన్, ఉదయ్, నీరజ, చంద్రారెడ్డి, హబీబ్, షాకీర్, కాలనీ చిన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం

కేవీపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కేవీపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం కేవీపల్లెలో పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త పథకాలతో చరిత్ర సృష్టించారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గజ్జెల శృతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జయరామచంద్రయ్య, నాయకులు సైపుల్లాఖాన్, రత్నాకర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, రవికుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దండు వెంకటరమణారెడ్డి, ఎల్లారెడ్డి, సిరి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



పీలేరు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కలికిరిలో..

కలికిరి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా ఆవిర్భావ సంబరాలు జరుపుకున్నారు. ముందుగా పట్టణ పరిధిలోని ఇందిరమ్మకాలనిలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీ(ప్రభుత్వాసుపత్రి)లో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ప్రజా సంక్షేమం, పేదల అభివృద్ధి కోసమే పార్టీ ఆవిర్భవించిందని నాయకులు అన్నారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమేష్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఫామొహిద్దీన్, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, శివాజీ, సర్పంచ్‌లు ఆర్.వెంకటరెడ్డి, తస్లీమారియాజుద్దీన్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్ కుమార్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.